# రూ.441 కోట్లతో నియోజకవర్గం అభివృద్ధి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్

- రూ.80 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలు అందజేత
- మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 21: తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత అంబర్‌పేట నియోజకవర్గంలో రూ.441 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. అదేవిధంగా మరో రూ.80 కోట్లతో పలు సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందని చెప్పారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గడిచిన నాలుగున్నరేండ్లలో అంబర్‌పేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి, అందజేసిన సంక్షేమ పథకాల వివరాలను కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అంబర్‌పేట శంకర్‌లతో కలిసి వెల్లడించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్ హరీశ్‌రావుల సహకారంతో అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందని చెప్పారు. ప్రధానంగా జీహెచ్ఎంసీ ద్వారా రూ.130 కోట్లతో రోడ్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల ఏర్పాటు, అధునీకరణ, వర్షపునీటి పైప్‌లైన్ల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వాటర్‌వర్క్స్‌కు సంబంధించి రూ.56 కోట్లతో నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీలో నూతన మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఏర్పాటు చేయించానని చెప్పారు. కలుషిత మంచినీటి సమస్యను పూర్తిగా రూపుమాపడం జరిగిందన్నారు. ఎస్ఎన్‌డీపీ కింద నియోజకవర్గంలో రూ.60కోట్లతో పనులు చేపట్టామని, ఇందులో రత్నానగర్, శివానందనగర్ వద్ద హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణం, ఓల్డ్ రామాలయం వద్ద వర్షపునీటి నాలా అభివృద్ధి, మొయిన్ చెరువు సుందరీకరణ వంటి పనులు చేపట్టామని చెప్పారు. ఇందులో కొన్ని ఇంకా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీఆర్ఎంపీ కింద రూ.100 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లను నూతనంగా నిర్మించడం జరిగిందన్నారు. నల్లకుంట ఫీవర్ దవాఖానలో రూ.12 కోట్లతో నూతన ఓపీ బ్లాక్ నిర్మాణం జరుగుతున్నదని తెలిపారు. మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.20 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో నియోజకవర్గంలోని చాలా పార్కులను అందంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా నుంచి నాగోల్ వరకు 120 ఫీట్ల రోడ్డును రూ.60 కోట్లతో నిర్మించామని, ఇందులో 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

**రూ.80కోట్లతో సంక్షేమ పథకాలు ..**

అంబర్‌పేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.80 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేశామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు.

## సామాజిక సేవలోనూ.. ముందంజ



రక్తదాన శిబిరంలోపాల్గొన్న పీటీసీ ప్రిన్సిపాల్ పి.మధుకర్‌స్వామి

గోల్నాక, అక్టోబర్ 21: ప్రజా సేవతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో దేశంలోనే తెలంగాణ పోలీస్ ముందంజంలో ఉందని అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి. మధుకర్ స్వామి తెలిపారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా అంబర్‌పేట పీటీసీలో పోలీసు అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ గ్రీన్ లాండ్స్, రామ్కీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్త దాన శిబిరాన్ని పీటీసీ ప్రిన్సిపాల్ పి.మధుకర్ స్వామి ప్రారంభించగా దాదాపు 150 మంది పోలీసు అధికారులు, పౌరులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో పీటీసీ డీఎస్పీలు ఎం.పిచ్చయ్య, జి.జగన్, పి.లక్ష్మికాంత్, కె.విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఏవో జి.రామారావు, రామ్కీ షౌండేషన్ ప్రతినిధులు రామ్‌రెడ్డి, సుమతి, లయన్స్ క్లబ్ గ్రీన్ లాండ్స్ జోన్ చైర్ పర్సన్ లక్ష్మికుమారి, వైస్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలు..

కాచిగూడ/ గోల్నాక, అక్టోబర్ 21: తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండుగ దసరా పండుగ అని జలమండలి డీజీఎం సన్యాసిరావు అన్నారు. దేవీ శరన్నవరాత్రిఉత్సవాల్లో భాగంగా నారాయణగూడ జలమండలి కార్యాలయంలో శనివారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు భావన, మహేందర్‌రెడ్డి, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

అదేవిధంగా శనివారం గోల్నాక డివిజన్ తులసీరాంనగర్ లంకలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు.



తులసీరాంనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలోని అమ్మవారి పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

## పోటీ చేస్తే కిషన్‌రెడ్డిది గెలవలేని పరిస్థితి

- అందుకే పోటీ నుంచి తప్పుకోవాలని చూస్తున్నాడు
- బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లోకి స్వచ్ఛందంగా వస్తున్నారు
- ఎవరినీ డబ్బిచ్చి కొనడం లేదు
- బీజేపీలో చేరిన కృష్ణాయాదవ్‌ను ఎన్ని డబ్బులు ఇచ్చి కొన్నారో వారు చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్



నల్లకుంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రమణానాయుడుకు పార్టీ కండువా కపప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 21: మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా, సికింద్రాబాద్ ఎంపీగా కేంద్ర మంత్రిగా ఉన్న జి.కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గానికి ఏమీ చేయలేదని, కనీసం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా ఏమీ చేయకపోవడంతో అసంతృప్తితో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే అభ్యర్తి కాలేరు వెంకటేశ్ చెప్పారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరుతున్న వారిపై బీజేపీ నాయకులు కొందరు అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మ, సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, నిన్న బీజేపీలో చేరిన అంబర్‌పేట శంకర్‌పై కూడా డబ్బులు తీసుకొని పార్టీలోకి వెళ్లారనే కామెంట్లు చేస్తున్నారని, ఎవరిని కూడా తాము డబ్బులు ఇచ్చి కొనడం లేదని చెప్పారు. ఈ మాటకొస్తే బీజేపీలో చేరిన కృష్ణాయాదవ్‌కు ఎన్ని డబ్బులు ఇచ్చి బీజేపీలో చేర్చుకున్నారో తెలపాలని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డికి ఎంపీగా 40వేల పై చిలుకు మెజార్టీ ఇచ్చిన అంబర్‌పేట నియోజకవర్గానికి కనీసం చిల్లిగవ్వ కూడా ఖర్చు పెట్టలేదని, బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఏ విధంగా ఆదుకోలేదని చెప్పారు. కేంద్రంలో ఆయన మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న ఏ ఒక్క నామినేటెడ్ పదవిని కూడా పార్టీ నాయకులకు ఇవ్వలేదని, ఆ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో అంబర్‌పేటలో ఉన్న నిరుద్యోగులకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదన్నారు. కార్యకర్తలను ఆర్థికంగా కూడా ఆదుకోలేదని చెప్పారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి బడ్జెట్‌లో పదిశాతం ఖర్చు పెడితే మూసీ ప్రక్షాళన జరుగుతుందని, అంబర్‌పేటలో అన్ని బస్తీలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎంపీ నిధులను కూడా ఖర్చు పెట్టలేదని ఎద్దేవా చేశారు. అంబర్‌పేటలో మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తే గెలవని పరిస్థితి ఉందని, అందుకే పోటీ నుంచి తప్పుకోవాలని చూస్తున్నారని చెప్పారు. మున్ముందు ఇంకా భారీగా చేరికలు ఉంటాయన్నారు.

**బీఆర్ఎస్‌లోకి నల్లకుంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు..**

భారతీయ జనతా పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరాడు. పార్టీ నాయకుడు బి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మాజీ గ్రేటర్ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ బషీరుద్దీన్, బూత్ కమిటటీ సభ్యులు జి. విజయ్‌కుమార్, ఎ.వి. నారాయణ, పవన్‌కుమార్, ఎన్.వి.కౌశిక్‌నాథ్ తదితరులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో చాలా మంది బీజేపీ నాయకులు ఆ పార్టీ పై ఉన్న అసంతృప్తితో బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. పార్టీలోకి వచ్చే వారందరినీ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు బైండోవర్..

కాచిగూడ,అక్టోబర్ 21: రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇద్దరు రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పలు కేసుల్లో సంబంధం ఉన్న పీఎస్ పరిధిలోని ఇద్దరు రౌడీషీటర్లను బైండోవర్ చేసి ఆర్డీఓ ముందు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

## మద్యం బాటిళ్లు పట్టివేత

కాచిగూడ,అక్టోబర్ 21: రానున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు,ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హర్రాస్‌పెంట ప్రాంతానికి చెం దిన ముత్యాలు కుమారుడు దిగ్వి వెంకటేశ్(36)గుట్టుచప్పుడు హర్రాస్‌పెంటలో మద్యం బాటిళ్లను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని 44 క్వాటర్ బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకొని వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

## వైభవంగా బతుకమ్మ వేడుకలు

కాచిగూడ/గోల్నాక, అక్టోబర్ 21: తెలంగాణలో బతుకమ్మ పండుగను మహిళలు వైభవంగా జరుపుకుంటారని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని మున్సిపాల్ గ్రౌండ్, కాచిగూడ, బర్కత్‌పుర ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వెన్నముద్దల బతుకమ్మ వేడుకలు శనివారం కాచిగూడ,బర్కత్‌పుర డిపో మహిళలు వైభవంగా నిర్వహించారు. కాచిగూడ, బర్కత్‌పుర ఆర్టీసీ డిపో మహిళలు పాల్గొన్నారు.



అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శనివారం బతుకమ్మ ఆడుతున్న మహిళా పోలీసులు



కాచిగూడ డిపోలోబతుకమ్మ ఆడుతున్న మహిళలు



బర్కత్‌పురడిపో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## డెమో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 21: పట్టాలు దాటుతుండగా డెమో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)శనివారం ఉప్పుగూడ–ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన డెమో రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అదే రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై బుడిద రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.7 ఉన్నటు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతుని వివరాల కోసం 8712568495లో సంప్రదించాలని చిమ్నానాయక్ తెలిపారు.